క్లుప్తంగా

ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శిగా ఖలీద్

ఎదులాపురం: ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శిగా ఖలీద్, ఆదిలాబాద్‌రూరల్ మండల అధ్యక్షుడిగా రాసం రాజును నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు మున్సిగెల నర్సింగ్ ఈమేరకు శనివారం వివరాలు వెల్లడించారు. వారు మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి కల్యాణం

ఎదులాపురం: పట్టణంలోని ద్వారకానగర్‌లోని బ్రహ్మంగారి ఆలయంలో శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కులదైవం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూల విరాట్టులకు ప్రత్యేక పూజల చేసి, అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కులసంఘ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బోంస్లే దశరథ్

ఎదులాపురం: ఆరె మరాఠ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శివాజీచౌక్‌లో ఆదివారం నిర్వహిస్తున్న ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బోంస్లే దశరథ్ పటేల్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజుశిందే, గోవింద్‌రావు, అవినాశ్, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మార్గంతో శాంతిస్థాపన



బుక్‌స్టాల్ ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

ఎదులాపురం: ధ్యాన మార్గంతో శాంతిస్థాపన సాధ్యమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బుక్‌స్టాల్ ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలో చేపడుతున్న కార్యక్రమాల సరళిని కేంద్రం నిర్వాహకురాలు రేవతి బెహన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పుష్ప బెహెన్, అర్చన బెహన్, గీత బెహన్, సరళ బెహన్, డాక్టర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

తలమడుగు: మహా శివరాత్రి పర్వదినాని పురస్కరించుకొని రుయ్యాడి గ్రామంలో శనివారం 200 మందికి జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కవిత దంపతులు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని శివాలయంలో హోమం, యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమలేష్‌రెడ్డి, మానస, వెంకట్‌రెడ్డి, భోజరెడ్డి, గంగాధర్, మోతె శ్రీనివాస్, గంగన్న, అశోక్, ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


జైనథ్: మండలంలోని దీపాయిగూడలో జోగు భోజమ్మ ఆశన్న స్మారక క్రికెట్ పోటీలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులైన జోగు భోజమ్మ ఆశన్నల స్మారకార్థం, జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మండల కేంద్రంలో రూ. 3.80 కోట్లతో మినీ స్టేడియం మంజూరు చేయడం జరిగిందన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్, తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పన్ లింగారెడ్డి, సర్పంచ్ బొల్లి గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామ శివారులోని సోమన్న తీర్థం జాతర వద్ద శనివారం పేకాటాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు బోథ్ ఎస్సై రవీందర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.3590లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా పేకాట ఆడినట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.



జైనథ్: సహస్ర లింగానికి పూజలు చేస్తున్న భక్తులు



నేరడిగొండ: సోమేశ్వరని దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఇచ్చోడ: సిరిచెల్మ మల్లన్న ఆలయం వద్ద భక్తజన సందడి

ఓం నమఃశివాయ

- ఘనంగా మహాశివరాత్రి
- ఆలయాల్లో భక్తజన సందడి
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

● నేరడిగొండ మండలంలోని శివాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడూర్ శివలింగాలయం, మహాదేవుని ఆలయం, కుమారి, సవర్గాం గ్రామాల్లో రాజరాజేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కుంటాల జలపాతం వద్ద సహజ సిద్ధంగా ఏర్పడిన సోమేశ్వర ఆలయంలో శివలింగం, నందీశ్వర విగ్రహాలకు అభిషేకం తోపాటు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

● ఇచ్చోడలో శివనామస్మరణలతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. శివరాత్రి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని రెండు శివాలయాలతో పాటు సిరిచెల్మలోని అతి పురాతన మల్లన్న ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని శివాలయం వార్షికోత్సవం సందర్భంగా రుద్రాభిషేకం, రుద్రహసనం, గణపతి పుణ్యవచనం, నవగ్రహ పూజలు నిర్వహించారు.

● గుడిహత్నూర్ మండల కేంద్రంలోని శివాలయంలో రాత్రి 2 గంటల నుంచే మహా దేవుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించారు.

● నార్నూర్ మండలంలోని చోర్గావ్, భీంపూర్ శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చోర్గావ్ శివాలయంలో శ్రీమూర్తి రాములు పీఠాధిపతి శ్రీసంత్ శ్రీరాం మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

● తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి, శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వడ్డాడి గ్రామంలోని స్వయంభూ లక్ష్మీ నృసింహ ఆలయంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గోడం నగేశ్ పూజలు చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

● జైనథ్ మండలంలోని భోరజ్ రామలింగేశ్వర ఆలయం, కోర్టలోని శివాలయం, కంఠలోని కోటి లింగాల ఆలయం, పెండల్‌వాడలోని ఆత్మలింగ హనుమాన్ ఆలయం, లక్ష్మీపూర్‌లోని మార్కండేయ ఆలయం, అడలోని శివాలయం, కూరలో వేంకటేశ్వర ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ఎమ్మెల్యే జోగు రామన్న స్వగ్రామమైన దీపాయిగూడలో శివరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అడ గ్రామంలోని శివాలయంలో పూజలు చేశారు.

● తలమడుగు మండలంలోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఝరి, రుయ్యాడి, కజ్జర్ల, చెర్లపల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రుయ్యాడిలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీపీ కల్యానం లక్ష్మి రాజేశ్వర్, పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.

● ఉట్నూర్‌లోని శివాలయంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తలమడుగు: శివపార్వతుల కల్యాణం



జైనథ్: పూజలు చేస్తున్న పాయల్ శంకర్

శివలింగానికి అభిషేకం చేశారు. ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● బోథ్ మండల వ్యాప్తంగా శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మండలంలోని కైలాస్ టెకిడి ఆలయానికి భక్తులు వందల సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. మార్కండేయ, విఠలేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● బేల మండలంలోని బాది గ్రామ శివారులోని నందీశ్వర ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. శివలింగం, నందీశ్వర విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆవులు, లేగ దూడలను ఆలయానికి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బస చేశారు.

పండ్ల ధరలకు రెక్కలు



కైలాస్‌నగర్: పండగ పూట పండ్ల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. మూడు రోజుల కిందటి ధరలతో పోల్చితే కిలోకు రూ.30 నుంచి రూ.40 అదనంగా పెరిగాయి. జోరుగా విక్రయాలు సాగడంతో పట్టణంలోని పండ్ల దుకాణాలన్ని కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. డజన్ అరటిపండ్లు సాధారణ రోజుల్లో రూ.30, రూ.40కి లభించగా, పండగ వేళ రూ.60, రూ.80కి విక్రయించారు. ద్రాక్ష పండ్లు రెండు రోజుల కిందట రూ.40కిలో విక్రయించగా, ప్రస్తుతం రూ.60, రూ.70కి విక్రయించారు.



బేల: నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

● సిరికొండ శివాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి శోభాయాత్ర చేపట్టారు. అనంతరం శివ పార్వతుల కల్యాణం జరిపించారు.

- 'సాక్షి, నెట్‌వర్క్



తలమడుగు: పూజలు చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



నార్నూర్: చోర్గావ్ శివాలయంలో..



తాంసి: ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



బోథ్: కైలాస్ టెకడి శివాలయం వద్ద..

నేడు రక్తదాన శిబిరం

బోథ్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మండలంలోని సొనాల గ్రామంలో నవ నిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ, ఛత్రపతి శివాజీ మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు శుద్ధోధన్ తెలిపారు. సొనాలతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాటల సీడీ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సద్గురు ప్రేంసింగ్ మహరాజ్

నార్నూర్: బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ పాటల సీడీని శనివారం మండలంలోని కొత్తపల్లి(హెచ్) బంజారా జాతీయ దీక్షభూమి వద్ద దీక్ష గురువు శ్రీసంత్ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ బిడ్డ మెస్రం పురుషోత్తం సేవాలాల్ మహరాజ్ చరిత్ర తెలుసుకొని పాటలు రచించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాదవ్ వసంత్‌రావు, రాష్ట్ర సాంస్కృతి అధ్యక్షుడు నరహరిదాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న వన్నెల అశోక్

తలమడుగు: కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని టీపీసీసీ సభ్యులు వన్నెల అశోక్ అన్నారు. శనివారం మండలంలోని కోసాయి, పల్సి, పల్సి(బి) గ్రామాల్లో హాథ్‌సే.. హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రతీ ఇంటికి తిరిగి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కాంగ్రెస్ హయాంలో అయిందన్నారు. టీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ఒక్క కుటుంబం రాజ్యమేలుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజేశ్వర్, కిష్టన్న, హర్షద్, వెంకన్న, గంగారాం, మోహన్, వామన్ పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన వడ్రంగి సుర్పంచ్ దత్తు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భోరజ్ చెక్‌పోస్ట్ వెలవెల

- కనిపించని ప్రైవేట్ సిబ్బంది
- ఎంవీఐలు, ఏఎంవీఐల మధ్య కోల్డ్‌వార్!

జైనథ్: 44వ నంబరు జాతీయ రహదారిపై భోరజ్ సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ గత రెండు రోజులుగా నిర్మానుష్యంగా మారింది. ఆర్టీఏ అధికారులు అనాధికారికంగా నియమించుకున్న సిబ్బందిది విధులకు రాకపోవడంతో వాహనాల తనిఖీలు తూతూమంత్రంగా జరిగాయి. గత అయితే ఎంవీఐలు, ఏఎంవీఐల మధ్య చెక్‌పోస్ట్ వద్ద డ్యూటీల విషయంలో బెడిసికొట్టడంతోనే ప్రైవేట్ సిబ్బందిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. చెక్‌పోస్ట్ వద్ద మొత్తం 7గురు ఎంవీఐలు, 13మంది ఈఎంవీలు ఉండగా.. వీరికి తోడుగా మరో 25 మంది ప్రైవేట్ వ్యక్తులు ఉన్నారు. ప్రతీరోజు అక్కడ ఎవరూ డ్యూటీలు నిర్వహించాలి అనే విషయంలో అధికారుల నడుమ మూడు నెలలుగా వివాదం కొనసాగుతుంది. కొంత మందికి అక్కడ డ్యూటీలు వేయకపోవడంతో, ఇక్కడ జరుగుతున్న వసూళ్ల గురించి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

జీఎస్టీ తరువాత ఆర్టీఏదే హవా..

జీఎస్టీ రాక ముందు చెక్‌పోస్ట్ వద్ద కమర్షియల్ ట్యాక్స్ అధికారుల హవా ఉండేది. అప్పట్లో తరుచుగా చెక్‌పోస్ట్ వద్ద ఏసీబీ దాడులు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఏసీబీ దాడుల్లో అధికారులు పట్టుబడిన కూడా వసూళ్ల పర్వ మాత్రం ఆగలేదు. జీఎస్టీ చట్టాన్ని తీసుకొచ్చిన తరువాత వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కేవలం పేరుకే పరిమితమయ్యారు. చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల బాధ్యత వారికి లేకపోవడంతో చెక్‌పోస్ట్ మొత్తం ఆర్టీఏ అధికారుల చేతుల్లోకి వెళ్లింది. ప్రస్తుతం చెక్‌పోస్ట్ వద్ద మార్కెట్, అటవీ, ఆర్టీఏ అధికారులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఆర్టీఏ అధికారుల హల్‌చల్ ఎక్కువగా కనిపిస్తుంది. బహిరంగంగా ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రైవేట్ వ్యక్తులు పెద్ద ఎత్తున విధులు నిర్వహిస్తుండడంతో భారీ మొత్తం ట్రాఫిక్ జామ్ దృశ్యాలు కనిపిస్తుంటాయి.



సిబ్బంది ఎదురుగానే దర్జాగా వెళ్తున్న లారీలు

అంతా బహిరంగమే..

చెక్‌పోస్ట్ వద్ద ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ సిబ్బందిని నియమించుకొని మరి వాహనాలను తనిఖీ చేయడం అందరికి తెలిసిన విషయమే. ప్రభుత్వం ఇచ్చే జీతంతో ఒక ఉద్యోగే పనిచేయడం భారంగా భావిస్తున్న ఈ కాలంలో, ఏకంగా ప్రైవేట్ సిబ్బందిని నియమించుకొని ఎందుకు విధులు నిర్వహిస్తున్నారు అనేది అందరికి తెలిసిన సత్యమే. దీంతో అధికారులు చెప్పిందే వేదం అన్న చందంగా మారింది. గత రెండు రోజులుగా చెక్‌పోస్ట్ బోసిపోవడం చూసిన జన ముక్కున వేలేసుకుంటున్నారు? చెక్‌పోస్ట్‌లో ఏం జరుగుతోంది? ప్రైవేట్ సిబ్బందిని ఎందుకు తొలగించారు? ఎంవీఐలు, ఏఎంవీఐల నడుమ వార్ నిజమేనా? అనే కోణంలో మండల వాసులు చర్చించుకుంటున్నారు.



చెక్‌పోస్ట్ వద్ద ఆర్టీఏ తనిఖీ కేంద్రం

తాగునీటి కష్టాలు..



చేతి పంపు వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. దీంతో కోలాం గిరిజనులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ప్రతీరోజు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయకపోవడంతో మండలంలోని సమాక గ్రామ పంచాయతీ పరిధిలోని పాటగూడ (కోలంగూడ) గ్రామస్తులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గ్రామ పోలిమేరలోని వ్యవసాయ బావు వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. వేసవిలో నీటి ఎద్దటి

తాగునీటి కోసం పడిగాపులు..

మండలంలోని సమాక గ్రామ పంచాయతీ పరిధిలోని పాటగూడ(కె) గ్రామంలో 65 కుటుంబాలు, సుమారు 300లకు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. గ్రామానికి భగీరథ నీరు సరఫరా విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రెండు రోజులు, మూడు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పోలిమేరలో ఉన్న వ్యవసాయ బావి, చేతిపంపుల వద్ద పడిగాపులు పడుతున్నారు. ప్రతీరోజు భగీరథ నీటిని సరఫరా చేయాలని విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెగ్యులర్‌గా నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ప్రతీరోజు నీటి సరఫరా చేయడం లేదు. రెండు, మూడు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. నీళ్లు రాని రోజుల్లో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు ప్రతిరోజు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలి.

– కోదప సోనిబాయి, పాటగూడ

ప్రతీరోజు సరఫరా చేయాలి



ప్రతీరోజు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలి. వ్యవసాయ పనులు మానేసి నీటి కోసం పడిగాపులు కాస్తున్నాం. వేసవి రాకముందే తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– టికం శాంతబాయి, పాటగూడ

'ఇచ్చోడ ఎంపీపీని అరెస్టు చేయాలి'

బోథ్: ఇచ్చోడ మండలంలో జర్నలిస్టుతో పాటు ఆదివాసీ, లంబాడా కులాలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని జైఆదివాసీ యువసేన నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్, కుమురంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు చేయాలని ఫిర్యాదు చేసినా.. కేసు నమోదు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో స్టేట్ కో కన్వీనర్ మెస్రం ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు బిపిన్ కుమార్, ప్రకాష్, గణేష్, శంకర్, జగపతి, సునీల్ కుమార్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



కుమురంభీంకు నివాళులర్పిస్తున్న నాయకులు

శనగపంట కోతలు షురూ

తాంసి: జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో రైతులు సాగుచేసిన శనగపంట కోతకు వచ్చింది. రైతులు పంటను కోసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కూలీల కొరత అధికంగా ఉండడంతో హార్వేస్టర్ సాయంతో పంటను నూర్పిడి చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచి గ్రామాలకు హార్వేస్టర్లు చేరుకున్నాయి. ఒక ఎకరం నూర్పిడి చేయడానికి రూ.1800 నుంచి 2000 వరకు రైతులు చెల్లిస్తున్నారు.



శనగపంట కోస్తున్న హార్వేస్టర్